క్లుప్తంగా

ఎస్సైని సన్మానించిన మాజీ సర్పంచ్



శాయంపేట : నూతన ఎస్సైగా జక్కుల పరమేష్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. సోమవారం మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీలు బగ్గి రవి, గజ్జి అయిలయ్య, నాయకులు దుబాసి కృష్ణమూర్తి, ప్రవీణ్, పైడి ఉన్నారు.

యూత్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



వేలేరు : ఇటీవలే జరిగిన ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జక్కిడి శివచరణ్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వేలేరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగుల రణధీర్ రెడ్డి ఆధ్వర్యంలో యూత్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించాడు. కలిసిన వారిలో మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, మండల ఉపాధ్యక్షుడు రాజేందర్, కొలిపాక వెంకటేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయికి బిట్స్ విద్యార్థులు



పరకాల : పట్టణంలోని బిట్స్ పాఠశాల విద్యార్థులు సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన బొనగాని నాగశ్రీ, ఇ.జిత్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యుగేందర్ అభినందించారు. రెజ్లింగ్ క్రీడలో విజయపతాకం ఎగురవేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుల చేయూత



కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సముద్రాల బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబం రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న బక్కయ్య చిన్ననాటి మిత్రులతో పాటు 1986–87 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు సోమవారం బక్కయ్య కుటుంబానికి రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో ఎర్రబెల్లి సంపత్‌రావు, దేశిని హరిశంకర్, మిల్కూరి లక్ష్మీనారాయణ, దేవ శ్రీనివాస్, కెంసారపు రాజమౌళి, మంద శ్రీనివాస్, సూర్యప్రకాష్, నూనె మొగిలి, కిషన్‌రావు, ఎంసాని నర్సయ్య, కె.దేవేందర్, జి.రమేష్, లక్ష్మీభవాని, సుభాషిణి ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



వేలేరు : అధికార కాంగ్రెస్ నాయకుల అండదండలతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమపై దాడులు చేస్తున్నాడని మండలంలోని గుండ్లసాగర్‌కు చెందిన నీలం యాదగిరి దంపతులు ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యాదగిరి మాట్లాడుతూ గ్రామానికి చెందిన నీలం కుమార్‌కు తమకు మధ్య గతకొంత కాలంగా భూ వివాదం నెలకొందని, ఈనెల 5న తన భార్య సునిత బావివద్ద పనిచేస్తుండగా కుమార్, ఆయన ఇద్దరు కుమారులు వ్యక్తిగతంగా దుర్భాషలాడుతూ దాడి చేసి గాయపర్చారని చెప్పారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని అన్నారు. వారిపై కేసు నమోదైన కూడా అధికార పార్టీకి చెందిన నాయకుల సహకారంతో తమను వ్యవసాయం కూడా చేసుకోనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా పోలీసులు తమపై దాడి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని వారి నుండి రక్షణ కల్పించాలని కోరారు.

అసంపూర్తి రోడ్డుతో ఇక్కట్లు

- నాలుగేళ్లయినా పూర్తి కాని రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆత్మకూరు: మండలంలోని హౌజుబుజుర్గు గ్రామం నుంచి శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోడ్డు పని పూర్తి కాలేదు. సగం రోడ్డు వేశారు. సగం రోడ్డు కంకరతో ఉంది. రాత్రి వేళ వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నాలుగేళ్ల క్రితం గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా రూ.3కోట్ల21లక్షలు మంజూరుకాగా 2021జూలై19న అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పనులను ప్రారంభించారు. అయితే కాలం గడిచినా రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో కాలేదు. ఈ రోడ్డు గుండా నిత్యం ప్రజలు బైక్‌లు, ఆటోలు, జీపులు, ట్రక్కుల ద్వారా ప్రగతిసింగారం, నేరెడుపల్లి, కాట్రపల్లి, పత్తిపాక, సూర్యానాయక్ తండా తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అసంపూర్తి పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



అసంపూర్తిగా వదిలేసిన బీటీ రోడ్డు

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్

కమలాపూర్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించి రికార్డులు తనిఖీ చేసి పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రౌడీషీటర్లు భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడకూడదని, పంచాయితీలు నిర్వహించకూడదని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ తిరుమల్

ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలి

- సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్

ధర్మసాగర్ : విద్యార్థులు విద్యలో చక్కటి ప్రతిభ కనబరుస్తూ ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సీడబ్ల్యూసీ సభ్యుడు, మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. మండలంలోని నారాయణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు అసాంఘిక, అమర్యాదకరమైన ఆలోచనలు దరి చేరకుండా చూసుకుంటూ విద్యపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. తమ తల్లిదండ్రుల ఆశయాలను వమ్ముచేయకుండా తమ భవిష్యత్‌పై ఒక చక్కని మార్గ నిర్దేశముతో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు, మన గ్రామం గర్వించే విధంగా ఎదగాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి నానమ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలకు దగ్గరకండి అని అన్నారు. లక్ష్యం మంచిదైతే శక్తి దానంతట అదే వస్తుందని అన్నారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ డాక్టర్ రామ్‌ధన్ అధ్యక్షత వహించగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మలహల్ రావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

టీజీసీటీఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి సన్మానం



పరకాల: తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్(టీజీసీటీఏ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు అశోక్ మోరె నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోష్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో టీజీసీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రమేష్, అశోక్, టి.కల్పన, ఆర్.ఈశ్వరయ్య, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- కమలాపూర్ సీఐ హరికృష్ణ

కమలాపూర్ : మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో ప్రశాంతంగా జరుపుకోవాలని కమలాపూర్ సీఐ హరికృష్ణ సూచించారు. వేడుకలకు సంబంధించి డీజేలకు అనుమతులు లేవన్నారు. 31న రాత్రి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, యువత కూడా అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరగకుండా నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లల్లోనే జరుపుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట: ప్రతి ఒక్కరూ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని స్థానిక సీఐ రంజిత్ రావు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా యువకులు అర్ధరాత్రులు మద్యం సేవించి వాహనాలపై తిరగవద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదన్నారు. అలాగే డీజేలకు ఎలాంటి అనుమతుల లేవని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగిన ప్రాణనష్టం వాటిల్లుతుందని ఎవరు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని 31న రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలకాలని సూచించారు.

బాలబాలికల పరిరక్షణ అందరి బాధ్యత

- ఎంఈఓ హనుమంతరావు

నడికూడ: బాల బాలికల పరిరక్షణ అందరి బాధ్యత, అని ఎంఈఓ కునుశోతు హనుమంతరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లింగవివక్ష పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సాధికారత కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు, సమాజంలో మహిళ సమానత్వం కోసం పాటుపడే వ్యవస్థలను నిర్మించుకోవాలని, స్త్రీ, పురుషులు సమానంగా చూడాలని, అన్నారు. యూత్ ఆర్గనైజేషన్ క్లస్టర్ కోఆర్డినేటర్ బోగి శ్రీలత మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారదా, శ్రీనివాస్,శారద, జోత్స్న, విద్యార్థులు, సర్వోదయా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ హనుమంతరావు

ప్యాకెట్ క్యాలెండర్ ఆవిష్కరణ



పరకాల : పట్టణంలోని అరుణ ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాపు యాజమాని గందె వెంకటేశ్వర్లు ప్రజలకు, రైతులకు కొత్త సంవత్సరం ప్యాకెట్ క్యాలెండర్‌ను మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం

- సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్

శాయంపేట : విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధ్యమని ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ అధ్యక్షతన పరీక్షలు ఒత్తిడి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించగా ముఖ్యఅతిథిగా డాక్టర్ ప్రహసిత్ పాల్గొని మాట్లాడారు. పరీక్షల ముందు, పరీక్షల సమయంలో, పరీక్షల తర్వాత వచ్చే ఒత్తిడికి కారణాలు, నివారణ మార్గాలను తెలిపారు. మంచి ఆహారమే ఆరోగ్యాన్ని అందిస్తుందని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి బ్రీతింగ్ టెక్నిక్స్, వ్యాయామాలు చేయాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళన చెందకుండా సమయపాలనతో ముఖ్యమైన ప్రశ్నలను నేర్చుకోవాలని, స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా చూసుకోవాలని ప్రతి విషయంపై పూర్తి అవగాహన పెంచుకొని ప్రణాళికలు తయారు చేసుకొని పాటించాలని అవగాహన కల్పించారు. ఎవరైనా ఒత్తిడికి గురైనట్లు అనిపిస్తే 14 416 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు మల్లేశం, సీతారాం నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

ఘనంగా అయ్యప్ప పూజ

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి దేవాలయం చైర్మన్ గురుస్వామి సామల భిక్షపతి 26వ మాలధారణ సందర్భంగా సోమవారం అయ్యప్ప నారికేలి పూజను ఘనంగా నిర్వహించారు. పూజను వేదమంత్రాల మధ్య వినాయకుడు, కుమారస్వామి, లక్ష్మీదేవి అయ్యప్ప స్వామి అష్టోత్తరాలు, శరణుఘోష, భజనలతో, భక్తి పాటలతో మార్మోగింది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వామి రాజ్‌కుమార్, గట్టు కిషన్, మార్త సుమన్, సదానందం, ప్రశాంత్, మల్లికార్జున్, బాలకృష్ణ, కుమారస్వామి, రవికమల్, రాజు, బాబురావు, మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, మాజీ ఎంపీటీసీ శంకరాచారి, నరేష్, పాల్గొన్నారు.

పంచకూట ఆలయంలో అన్నపూజ

ఆత్మకూరు: స్థానిక మహిమాన్విత పంచకూట పార్వతీదేవిసమేత మహాదేవస్వామి ఆలయంలో సోమవారం సోమావతి అమావాస్యను పురస్కరించుకొని అర్చకులు రవీందర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి అన్నపూజ చేశారు. ప్రత్యేక అలంకరణ చేశారు.భక్తులు లలిత సహస్ర నామపారాయణం, భజనలు చేశారు.



భజనలు చేస్తున్న భక్తులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

కమలాపూర్: మండలంలోని వంగపల్లి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని వంగపల్లికి చెందిన దురిశెట్టి శంకరయ్య తన భార్య సునీతతో కలిసి ద్విచక్ర వాహనంపై కమలాపూర్ నుంచి వంగపల్లికి వెళ్తున్నాడు. వంగపల్లి క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లగానే ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న వరంగల్–1 డిపోకు చెందిన టీఎస్ 03 యూబీ 8618 నంబరు గల ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

శాయంపేట : మండలంలోని మాందారిపేట శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేయగా రూ.8100 , పేక ముక్కలు లభ్యం కాగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. మండలంలోని మాందారిపేట శివారులో సోమవారం కొందరు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచా రంతో పేకాట స్థావరంపై దాడి చేయగా పోలీసులను చూసిన ఇద్దరు పారిపోగా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మాందారిపేటకు చెందిన కుక్కల సుధాకర్, కొలగాని విష్ణులు పారిపోవడంతో, అదేగ్రామానికి చెందిన చెక్క రవికుమార్, ముక్కెర రంజిత్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8,100 , పేక ముక్కలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజ్యాంగ హక్కులను వినియోగించుకోవాలి

- ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, సీఐ సంతోష్

ఆత్మకూరు: పౌరులు రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, సీఐ సంతోష్ అన్నారు. మండలంలోని నాగయ్యపల్లెలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరు కలిసికట్టుగా ఉండాలన్నారు. వివక్షకు తావులేకుండా జీవించాలన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, డీబీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి పక్కన సీఐ సంతోష్

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పరకాల: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని నాగారంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శైలజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీఓ మాట్లాడుతూ పౌర హక్కుల పరిరక్షణ చట్టం 1995ను అనుసరించి అంటరానితనం, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను నియంత్రించడం కోసం ప్రతి నెల చివరి పనిదినాల్లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ జంగా లక్ష్మణ్, కులవివక్ష పోరాట సమితి పరకాల పట్టణ అధ్యక్షుడు కుమార్, ఏపీఓ ఇందిర, ఏపీఎం క్రాంతి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఆర్ఐ దామోదర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సమానత్వంతో మెలగాలి

శాయంపేట : ప్రతి ఒక్కరూ కులమతాలకతీతంగా సమానత్వంతో మెలగాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని మైలారం గ్రామంలోని దళిత కాలనీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై పరమేష్, విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్, ఏపీఎం శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ రమేష్, సీసీ కేదారి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

దామెర: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్‌లో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ రంగాచారి, ఆర్ఐ భాస్కర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, తదిరతులు పాల్గొన్నారు.



పరకాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు



శాయంపేట: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ



దామెర: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

ఆన్‌లైన్ తప్పలతో ఇబ్బందులు

- ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో కాని వైనం
- నేటితో ముగియనున్న సర్వే
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

ఆత్మకూరు: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుండగా లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులు ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రశీదులు కూడా ఉన్నాయి. అయితే ఆన్‌లైన్ కాకపోవడంతో సర్వేకు వచ్చిన వారి వద్ద తమ పేర్లు లేకపోవడంతో దిక్కుతోచక ఇబ్బందులు పడుతున్నారు. జనవరి 5న ప్రజాపాలనలో ఇచ్చిన రశీదు చూపినప్పటికీ కంప్యూటర్‌లో పేరు లేదని లబ్ధిదారులను తిప్పి పంపుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు (మంగళవారం) సర్వే ముగియనుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన పెండెల సాంబలక్ష్మి, ముత్యాల రవి, రజిత, పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాటబత్తిని రజిత–రమేష్ ఇప్పటికే 200 యూనిట్ల గృహజ్యోతి కొరకు తిరుగుతున్నామని, గ్యాస్ రాయితీ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని లబ్ధిదారుల సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ప్రజాపాలన రశీదులు చూపెడుతున్న పేదలు

విద్యార్థులకు అభినందన

ఐనవోలు : రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొన్న మండలంలోని సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కట్కూరి రిత్విక్, బొల్లు సుమిత్‌లు సైక్లింగ్ విభాగంలో సీఎం కప్ పోటీలకు జిల్లా నుంచి ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. సోమవారం హెచ్‌ఎం అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులను, గైడ్ ఉపాధ్యాయుడు ప్రశాంత్‌లను అభినందించారు. అదేవిధంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారు అందించిన ట్రాక్ సూట్, ప్రశంశపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మమత, శాంసన్, సంజీవరావు, మంజులాల్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మసాగర్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలో ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని పీఆర్‌టీయూ ధర్మసాగర్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమన న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి జాన్‌సింగ్, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు జి శ్రీనివాస్‌రెడ్డి, మాధవి, కుమారస్వామి, సమ్మిరెడ్డి, చంద్రకళ, పి.శ్రీనివాస్, నరేష్ కుమార్, ఉద్యోగ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి